ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 19 ఫిబ్రవరి 2024

వైసీపీ మూకల వీరంగం






ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన
ముఖ్యమంత్రి హాజరైన సభ..
శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన
వేలాది మంది పోలీసులు హాజరైన సభ..
రాజ్యాంగంపై ప్రమాణం చేసిన
ప్రజాప్రతినిధులూ కొలువుదీరిన సభ..
అందరూ అక్కడే ఉన్నారు..
అక్కడే.. అక్కడే..
గూండాగిరీ సాగింది..
రౌడీరాజ్యం నడిచింది..
వైసీపీ నాయకులు, కార్యకర్తలు
ఉన్మాదుల్లా మారిపోయారు..
అధికారం ఉంది కదా అని..
రెచ్చిపోయారు..
ఒకరు కాదు.. ఇద్దరు కాదు..
వందమంది చుట్టుముట్టారు..
పిడిగుద్దులు గుద్దుతూ..
కర్రలతో బాదుతూ..
కాలితో తన్నుతూ..
అమానుషంగా..
విచక్షణారహితంగా..
అంతమొందిస్తామన్నట్లుగా..
ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై
దాడులు చేశారు..
విధ్వంసకాండ సాగించారు..
ఇదేనా.. సంక్షేమ పాలన
అంటే..?
ఇదేనా.. ప్రజారంజక
పాలన అంటే..?
సీఎం సభలోనే..
దౌర్జన్యకాండ..
సిగ్గు.. సిగ్గు..
ప్రజాస్వామ్య
దేశంలో
ఇది చీకటి రోజు..

చుట్టుముట్టి.. చితకబాదుతూ.. కాలితో తన్నుతూ..

రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణారహితంగా దాడులు చేశాయి. వృత్తి ధర్మంలో భాగంగా.. కార్యక్రమాన్ని కవర్ చేసేందుకెళ్లిన ఆయనపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు చుట్టుముట్టి తీవ్రంగా కొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీకృష్ణను ఆస్పత్రికి తరలించారు. దాడిని అన్నివర్గాలు తప్పుబడుతున్నాయి. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఖండిస్తున్నాయి.

వివరాలు 7, మెయిన్‌లో..




ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విచక్షణారహితంగా దాడి

సిద్ధం సభలో దౌర్జన్యకాండ

కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లగా దాష్టీకం..

తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలు..



23 నుంచి ఎఫ్‌ఏ-4 పరీక్షలు

కొత్తచెరువు, ఫిబ్రవరి 18: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు ఈనెల 23 నుంచి ఎఫ్‌ఏ-4 పరీక్షలు నిర్వహించున్నట్లు జిల్లా పరీక్షల నిర్వహణాధికారి భాస్కరరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు ఉంటాయన్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు 23 నుంచి 26వ తేదీ వరకు, 6 నుంచి 9వ తరగతి వారికి 23 నుంచి 28 తేదీ వరకు ఎఫ్‌ఏ-4 పరీక్షలు ఉంటాయన్నారు. పదో తరగతి వారికి 23 నుంచి మార్చి 4 వరకు ప్రీఫైనల్ పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు, మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

పుట్టపర్తి, ఫిబ్రవరి 18: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం స్పందన అర్జీల స్వీకరణం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మండల, గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం ఉంటుందనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్రహ్మోత్సవాలకు రారండోయ్..

మధ్వనవమి సందర్భంగా హనుమంతుడి ఆహ్వానం

హనుమంత వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు



కదిరి, ఫిబ్రవరి 18: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలంటూ హనుమంతుడు ఆహ్వానించాడు. ఆదివారం మధ్వనవమిని పురస్కరించుకుని శ్రీవారికి నిత్య కైంకర్యాలు, ఆస్థాన పూజలు, అర్చకులు చేశారు. అనంతరం శ్రీవారు విశేష పుష్పలంకరణతో హనుమంతవాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహోత్సవాలకు ఆహ్వానించడమే ఈ ఉత్సవం ఉద్దేశం. సరిగ్గా నెలరోజులకు బ్రహోత్సవాలు ప్రారంభమవుతాయి. హనుమంతుడు ప్రచారం చేస్తాడు. బ్రహోత్సవాలు మార్చి 19 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు 15రోజులపాటు నిర్వహించనున్నారు.

పురంలో ఐటీ గుబులు



ఐటీ సోదాలు చేసిన ఫైనాన్స్ కార్యాలయం

హిందూపురం వాణిజ్యకేంద్రంగా పేరుగాంచింది. జిల్లాలోనే అత్యధిక ఫైనాన్స్ సంస్థలు కూడా ఇక్కడే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆదాయపు పన్నుశాఖ అధికారులు వచ్చారన్న సమాచారంతో పలువురు శుక్రవారం రాత్రే పట్టణం వదిలినట్లు తెలిసింది. హిందూపురంలో రెండ్రోజులపాటు ప్రముఖ ఫైనాన్షియర్, స్థిరాస్తి వ్యాపారి ఇల్లు, కార్యాలయంపై ఆదాయపు పన్ను శాఖాధికారులు దాడులు నిర్వహించారు. శనివారం 11 గంటలకు ప్రారంభమైన ఐటీ దాడులు ఆదివారం ఉదయం 10 గంటల వరకు కొనసాగాయి. కార్యాలయంలో రికార్డులు, పత్రాలను పరిశీలించారు. పన్ను ఎగవేత భారీ మొత్తంలో ఉండవచ్చని సమాచారం. ఈ పరిస్థితుల్లో పట్టణంలోని మిగిలిన స్థిరాస్తి వ్యాపారులు, ఫైనాన్షియర్లు, చిట్స్ నిర్వహించేవారిలో ఆందోళన మొదలైంది.

- హిందూపురం



ఇతర ప్రాంతాలకు వ్యాపారులు, ఫైనాన్షియర్లు

హిందూపురంలో ఆదాయపు పన్ను శాఖాధికారులు దాడులు నిర్వహించి సుమారు ఎనిమిదేళ్లు కావస్తోంది. అప్పట్లో బంగారు షాపులపై ఐటీ అధికారులు దాడులు చేశారు. ఆ తరువాత ఒకట్రెండుసార్లు ముద్దిరెడ్డిపల్లిలో చేశారు. ఐదేళ్లుగా పట్టణంలో ఐటీ దాడుల ఊసేలేదు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తాజాగా ఐటీ దాడులు జరగడంతో ఒక్కసారిగా వ్యాపారులు, రియల్టర్లలో గుబులు పట్టుకుంది. ఈ పరిస్థితుల్లో ఎవరెవరిమీద ఐటీ దాడులు జరుగుతాయోనన్న చర్చ మొదలైంది. కొంతమంది పేరు మోసిన వ్యాపారులు, ఫైనాన్షియర్లు తలుపులు మూసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు సమాచారం.

మరికొందరిపై కన్ను



జాబితా అక్కడి నుంచేనా? సోదాల వెనుక వారేనా?

మరి కొందరిపై కన్ను

హిందూపురం.. కర్ణాటక సరిహద్దులో ఉండడంతోపాటు వాణిజ్య కేంద్రంగా దశాబ్దాలుగా పేరుగాంచింది. పట్టణంలో పదుల సంఖ్యలో వారు కడుతున్న పన్ను, వారి వ్యాపారాలకు ఏమాత్రం పొంతనలేదు. రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నా రూ.లక్షలకే పన్ను కడుతున్నట్లు సమాచారం. ఇలా చాలామంది పన్ను ఎగ్గొడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లు విశ్వసనీయ సమాచారం. పట్టణంలో ఎవరెవరి మీద దాడులు చేయాలన్న జాబితా రెడీ అయినట్లు సమాచారం. మరో ఐదారుగురు ముఖ్యులపై ఐటీ అధికారులు ఏ క్షణమైనా దాడి చేయవచ్చని విశ్వసనీయంగా తెలిసింది. శుక్ర, శనివారాల్లో దాడులతో కొంతమంది అలర్ట్ అయ్యారు. ఎప్పుడైనా కొందరిపై ఐటీ శాఖ దాడులు చేయవచ్చనీ, అందుకు సంబంధించి వారి జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం.

• జాబితా తయారీ వెనుక?

ఇటీవల అధికార పార్టీకి చెందిన రాష్ట్ర నేత హిందూపురంలో పర్యటించారు. ఆయన ప్రాతినిధ్యం వహించే జిల్లాలో ఇతర రంగాల్లో స్థిరపడినవారు, ప్రాబల్యం కలిగిన నాయకులు కానీ ఆయనతో కలిసిన తరువాతే పని చేస్తారని అక్కడివారు చెప్పుకుంటుంటారు. ఈ పరిస్థితుల్లో హిందూపురంలో కూడా డబ్బున్న వారిని దారికి తెచ్చుకునేందుకు ఐటీని ప్రయోగించారన్న అనుమానాలు లేకపోలేదు. హిందూపురం పర్యటనకు వచ్చినపుడు పట్టణంలో ఆర్థికంగా బలమైన వారు ఎవరెవరనే వివరాలు తీసుకుని, జాబితా రెడీ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఐటీ దాడులు జరిగి ఉండవచ్చనీ, ఇందులో అధికార పార్టీ ప్రమేయం ఉందేమోనని పట్టణ ప్రజలు చర్చించుకోవడం కనిపించింది. ఏది ఏమైనా హిందూపురంలో ఐటీ దాడులు నిర్వహించడంతో కొంతమంది వ్యాపారులు ఉలిక్కిపడ్డారు. శుక్రవారం సాయంత్రమే కొంతమంది వ్యాపారులు కర్ణాటకకు వెళ్లిపోయారు. మరికొంతమంది వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.



వారేనా సూత్రధారులు?

హిందూపురంలో ఎన్నడూలేనివిధంగా ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఐటీ అధికారులు దాడులు చేయడం కలకలం రేపింది. సోదాల వెనుక అధికార పార్టీ హస్తం ఉందా అని పట్టణంలోని కొంతమంది వ్యాపారులు అనుమానిస్తున్నారు. ఎందుకంటే వారం క్రితం పట్టణానికి చెందిన అధికార పార్టీ నాయకుడు త్వరలో కొందరిపై ఐటీ దాడులు జరుగుతాయని అన్నట్లు చర్చ సాగుతోంది. దీంతో వారే చేయించారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఒకరిపై దాడులు చేయిస్తే.. మిగిలిన వారు తమవైపు వస్తారనే ఇలా చేయించినట్లు చర్చ సాగుతోంది. హిందూపురంలో అత్యధిక మంది వ్యాపారులు అధికార పార్టీకి ప్రతికూలంగా ఉండటం సహజం. ఈ నేపథ్యంలోనే వారిని దారికి తెచ్చుకునేందుకు ఒకరికి ఝలక్ ఇచ్చారా.. మరికొందరికి కూడా ఇదే పరిస్థితి తప్పదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అలరించిన లయన్ నృత్యాలు

నృత్యం చేస్తున్న చైనా భక్తులు




చైనా నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మూడోరోజైన ఆదివారం ఆ దేశ భక్తులు స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్‌లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. లయన్ నృత్యం ఆకట్టుకుంది. చైనా సంప్రదాయరీతిలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరింపజేశాయి. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి.. భక్తులకు నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని భక్తులు దర్శించుకున్నారు. - పుట్టపర్తి



రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేస్తున్న వైసీపీ మూకలు

తీవ్రంగా గాయపడిన స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ

దాడి హేయమైన చర్య

పాత్రికేయులకు రక్షణ లేకపోతే ఎలా..?

టీడీపీ, జనసేన, బీజేపీ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి, కులసంఘాల నాయకులు

ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి ఖండన

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 18

రాప్తాడులో నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ అల్లరిమూకలు విచక్షణారహితంగా దాడి చేయడం హేయమైన చర్యని పలువురు రాజకీయ, విద్యార్థి, కులసంఘాల నాయకులు మండిపడ్డారు. విధి నిర్వహణలో ఉన్న అతడిపై కర్రలు, పిడిగుద్దులతో దాడి చేసిన తీరు ప్రతిఒక్కరిని కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్థానికంగా ఉన్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరించడంతోనే దారుణం జరిగిందని మండిపడ్డారు. దాడి చేసిన వైసీపీ అల్లరిమూకలను వెంటనే అరెస్టు చేసి శ్రీకృష్ణ మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పలువురు రాజకీయ నాయకులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకృష్ణను పరామర్శించి మెరుగైన వైద్యమందించాలని వైద్యులకు సూచించారు. మాజీ మంత్రి పరిటాల సునీత ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణను ఫోన్ ద్వారా పరామర్శించారు. కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వైసీపీ గూండాలు చేసిన దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు.

అదే విధంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసనకు దిగారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధిక దీక్షకు దిగుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శ్రీకృష్ణపై జరిగిన దాడిని ఖండించిన వారిలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మోద్దీన్, శింగనమల టూమెన్ కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, శింగనమల నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ, టీఎన్‌టీయూసీ నాయకులు కుంచెపు వెంకటేష్, పోతుల లక్ష్మీనరసింహులు, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య, ధర్మవరం టౌన్ అధ్యక్షుడు పరిసే సుధాకర్, రాష్ట్ర కార్యదర్శులు కమతం కాటమయ్య, తలారి ఆదినారాయణ, వెంకటశివుడు యాదవ్, జేఎల్ మురళీధర్, బుగ్గయ్య చౌదరి, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన టీడీపీ రాష్ట్ర వడ్డెర సాధికార సమితి కన్వీనర్ వడ్డే వెంకట్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట ఆంజినప్ప, జిల్లా కార్యదర్శి సాముకోటఆది, నాయకులు సంగా సుధాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, డీసీసీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయూబ్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, ఏపీఎన్జీఓ నగర అధ్యక్షుడు, ఇరిగేషన్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశులు, ఏపీయూడబ్ల్యూజే నేషనల్ కౌన్సిల్ మెంబర్ గుత్తా ప్రభాకర్‌నాయుడు, టీడీపీ బీసీ లీడర్ ఎండీ నాగభూషణం, న్యాయవాది హరి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున తదితరులు ఉన్నారు.

దురదృష్టకరమైన సంఘటన



శ్రీకృష్ణపై పైశాచికంగా దాడి చేస్తున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం దారుణం. ఈ ఘటనకు ఎస్పీ పూర్తి బాధ్యత వహించాలి. ముఖ్యమంత్రి సభలో జరిగిన ఈ ఘటనకు సీఎం కూడా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారముందనే అహంకారం, మేమేమి చేసినా ఎవరూ ఏమనరు.. కేసులు పెట్టరు... పోలీసులు మా చేతుల్లో ఉన్నారనే దురహంకారమా..? దుర్మార్గాలు, దాష్టీకాలను చేయడం సరైనది కాదు. వైసీపీ నాయకులకు పోయే కాలం దాపురించింది. పోలీసులు వీడియోలు తెప్పించుకొని దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలి. లేదంటే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి భవిష్యత్తు కార్యచరణ ప్రకటించాల్సి ఉంటుంది.

- కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి

దాడి దుర్మార్గమైన చర్య



దాడి చేయడం దుర్మార్గమైన చర్య. విధి నిర్వహణలో తన పని తాను చేసుకుంటున్న శ్రీకృష్ణపై దాడి చేయడం చూస్తుంటే అదేపనిగా చేసినట్లు ఉంది. ఈ దాడితో ముందు మరిన్ని దాడులకు తెగబడుతామని సీఎం జగన్ ముందస్తు సంకేతాలు పంపినట్లయింది. దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు అక్కడే ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికే పోలీసులు వైసీపీకి కార్యకర్తలు ఉన్నారన్న అపకీర్తిని మూటగట్టుకుంటున్నారు. దాడిచేసిన వారిని అరెస్టు చేసి ఇప్పుడైనా నిష్పక్షపాతంగా వ్యవహరించి ఆ అపకీర్తిని తొలగించుకోవాలి. లేదంటే అన్ని పార్టీల ఆధ్వర్యంలో విలేకరులకు అండగా పోరాటం చేయాల్సి ఉంటుంది.

- బీకే పార్థసారథి, శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు

నియంతృత్వ పోకడలకు నిదర్శనం



జగన్ నియంతృత్వ పోకడలకు శ్రీకృష్ణపై దాడే నిదర్శనం. సిద్ధం కార్యక్రమంలో మీడియా మిత్రులపై దాడికి పాల్పడుతుంటే అడ్డుకున్నందుకు శ్రీకృష్ణపై కర్రలతో విచక్షణారహితంగా హృదయవిదారకరంగా దాడి చేయడం సిగ్గుచేటు. తన వృత్తిధర్మాన్ని చేయడం తప్పా... ఆంధ్రజ్యోతిపై కసి ఉంటే రాజకీయంగా, యాడ్‌లు ఇవ్వకుండా చేస్తున్నారు. ఆ సంస్థలో పొట్టకూటి కోసం పనిచేస్తున్న వ్యక్తిని దారుణంగా, భయానకంగా కొట్టడం దారుణం. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి కేసులు పెట్టేందుకు సంసిద్ధు కావాలి.

- వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ ఎమ్మెల్యే


గూండాల్లా వ్యవహరిస్తున్నారు..



శ్రీకృష్ణపై దాడి చేయడం బాధాకరం. సిద్ధం సభలో స్వయాన సీఎం జగనే మీడియాపై ఖబడ్దార్ అంటూ గూండాలా వ్యవహరిస్తున్నారు. కనీసం పాత్రికేయులకు రక్షణ కల్పించలేని దద్దమ్మ, సైకో ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి రక్షణ కల్పిస్తుంది. దోపిడీ, దౌర్జన్యం, అరాచకమే వైసీపీ పనిగా పెట్టుకుంది. ఈ విషయం ప్రజలందరికి స్పష్టంగా అర్థమైంది. తప్పకుండా వచ్చే ఎన్నికల్లో ఇలాంటి వారిని ఇంటికి కాదు.. జైలుకు పంపాలి. తలకు, వీపుపై విచక్షణారహితంగా వందల మంది వైసీపీ గూండాలు కొట్టడం దారుణమైన చర్య. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఎస్పీ, డీఎస్పీలు చర్యలు తీసుకోవాలి.

-గోనుగుంట్ల సూర్యనారాయణ, బీజేపీ సీనియర్ నాయకులు

దాడి దురదృష్టకరం



ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి దురదృష్టకరం. సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభ నేపథ్యంలో కవరేజీ చేయడానికి వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై దాడి అంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. దాడిని మేం ఖండిస్తున్నాం.

- ఆలం, కేశవరెడ్డి, ద్విసభ్యకమిటీ సభ్యులు

దుర్మార్గం: రాంభూపాల్



ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ ఆదివారం విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. అత్యంత దారుణంగా దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. విధి నిర్వహణలో భాగంగా కవరేజీకి వెళితే వైసీపీ మూకలు దాడికి పాల్పడడం పిరికిపంద చర్య అని పేర్కొన్నారు.

ఇది ప్రజాస్వామ్యమా..?: జాఫర్



పోయేకాలం వచ్చే వైసీపీ అల్లరి మూకలు జర్నలిస్టులపై దాడులు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యమా..? అని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మండిపడ్డారు. నగరంలోని పావని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకృష్ణను జాఫర్, నగర కార్యదర్శి శ్రీరాములు, రమణయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నాయకులు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమవారం ఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



విడపనకల్లు: వైసీపీ మూకలు దాడికి తెగబడటం నీచమైన పిరికి పందుల చర్య అని ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల మండిపడ్డారు. హావళిగి గ్రామంలో బాబుష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దాడి విషయం తెలుసుకుని వెంటనే శ్రీకృష్ణను ఫోన్‌లో పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు రౌడీల్లా మీడియాపై దాడుల చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇంత నీచంగా దాడులు చేయటం ఏమిటని ప్రశ్నించారు. వీరి ఆటలు ఇక ఎన్నాళ్లో సాగబోవన్నారు. కొన్ని రోజుల్లో వీరి ఆగడాలకు రాష్ట్ర ప్రజలు అంతం పలుకుతున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ అల్లరిమూకల అరాచకాలను గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతారన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, ఇక మీదట ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి



మడకశిరటౌన్: దాడిచేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రోజు రోజుకూ వైసీపీ అరాచకాలు పెట్రేగుతున్నాయని, వృత్తి రీత్యా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభ కవరేజీ కోసం వెళ్లిన కృష్ణపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసులు చూస్తుండగానే వైసీపీ రౌడీమూకలు దాడి చేసినా ప్రేక్షకపాత్ర వహించడం విచారకరం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలకు తావులేకుండా దాడి చేసిన వారిపై కఠిన చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడి అమానుషం



విధినిర్వహణలో భాగంగా ముఖ్యమంత్రి సభలో ఫోటోలు తీస్తున్న ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయడం అమానుషం. ఇది పిరికిపంద చర్య. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. వైసీపీ కార్యకర్తలు రౌడీల్లా దాడిచేయడం పద్ధతికాదు. జర్నలిస్టులపై దాడులను ఏమాత్రం ఉపేక్షించరాదు. దాడులకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.

- పల్లె రఘునాథరెడ్డి, మాజీ మంత్రి

తప్పులు ఎత్తిచూపితే దాడులా..?

టీడీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు



- మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం: వైసీపీ అరాచకాలు, తప్పిదాలను ఎత్తిచూపినందుకు శ్రీకృష్ణపై వైసీపీ అల్లరిమూకలు దాడి చేయడం అమానుషమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు అన్నారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉందన్నారు. వైసీపీని ఇంటికి పంపించే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. ప్రజలచేతిలో వైసీపీ ఓడిపోవడం ఖాయమన్నారు. ఫోటోలు తీస్తున్న సమయంలో మీ తప్పిదాలు ఎక్కడ బయటపడతాయోననే భయంతోనే ఇలా దాడులకు తెగబడటం దారుణమన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. దాడిచేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులకే రక్షణ లేదు



వైసీపీ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకే రక్షణలేదు. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. శ్రీకృష్ణకు మెరుగైన వైద్యం అందించాలి. రాజకీయాలు రాజకీయాలుగానే ఉండాలి తప్ప జర్నలిస్టులపై దాడిచేయడం ఏంటి..?

- మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి

పిరికిపంద చర్య



దాడి పిరికిపంద చర్య. సిద్ధం సభను కవర్‌చేసేందుకు వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడికి పాల్పడటం దారుణం. విచక్షణారహితంగా దాడి చేశారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలి.

- బండారుశ్రావణిశ్రీ, టీడీపీ నాయకురాలు

కొట్టడం దారుణం..



ఈ దాడి ఓ రాక్షస క్రీడ. పోయేకాలం దగ్గరపడినప్పుడే ఇలాంటి దాడులకు ఒడిగడుతారు. ఒక వ్యక్తిని అరాచకంగా, విచక్షణారహితంగా కొట్టడం దారుణం. తప్పతాగి ప్రజల మీద దాడులు చేయడం సరైన పద్ధతి కాదు. ప్రభుత్వం, పోలీసులు ఇలాంటి దాడుల పట్ల నిర్లక్ష్యం ఉండటం సరికాదు. వీరు పట్టించుకోకపోవడంతో పిచ్చి పరాకాష్టకు చేరి దాడులకు పాల్పడ్డారు. వీడియో బయటికొచ్చింది కాబట్టి సరిపోయింది. లేకపోతే జర్నలిస్టులనే పట్టుకొని లోపలేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దాడికి పాల్పడిన వారిని పోలీసులు పూర్తిస్థాయిలో యాక్షన్ తీసుకోవాలి. పోలీసులను ప్రజలు వైసీపీ కార్యకర్తలుగా చూస్తున్నారు. దయచేసి ఉన్న కాస్తోకూస్తో గౌరవాన్ని కాపాడుకొని దాడికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో రాజకీయ పార్టీలన్ని ఏకమై పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

పరిటాల శ్రీరామ్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్

దద్దమ్మల పని...



దాడి బాధాకరం. దాడి వీడియోను చూస్తుంటే ప్రతి ఒక్కరి కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. ఇదే వైసీపీ చేతగానీ దద్దమ్మల పనే. దమ్ము, ధైర్యముంటే రాజకీయంగా ఎదుర్కోవాలి గానీ... ఇలా విధి నిర్వహణలో ఉన్న వారిపై దాడి చేయడం పనికిమాలిన చర్య. సిద్ధం సభలో సీఎం జగనే మీడియాను ఖబడ్దార్ అని హెచ్చరించారంటే... ఆయనే గూండాలను ప్రోత్సహించి మీడియాపై దాడి చేయాలని సూచించినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. దాడికి పాల్పడిన వారిపై రాష్ట్ర డీజీపీ, ఎస్పీ, డీస్పీలు విచారణ చేపట్టి నిందితులను రిమాండ్‌కు పంపాలి. లేదంటే అన్ని రాజకీయ, విద్యార్థి, కులసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేపడుతాం.

-భవానీ రవికుమార్, జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి

దాడిని అందరూ ఖండించాలి



ఈ దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలి. సిద్ధం సభలో వైసీపీ రౌడీమూకలు పనిగట్టుకొనే ప్లాన్ ప్రకారం దాడి చేసినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీలు చొరవ తీసుకొని దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.

బీవీ వెంకటరాముడు, టీడీపీ రాయలసీమ మీడియా కో-ఆర్డినేటర్

దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా హెచ్చరిక

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 18: ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి అనైతికమైన చర్యని ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందరం, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీసుబ్బారావు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ పేర్కొన్నారు. రాప్తాడు సిద్ధం సభలో శ్రీకృష్ణపై జరిగిన దాడిని వారు ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్టులు ఎక్కడ రాజకీయ పార్టీలు, సభలు, సమావేశాలు పెట్టినా వెళ్లి ఫోటోలు తీయడం, వార్తలు సేకరించడం రాజ్యాంగం కల్పించిన హక్కన్నారు. సీఎం జగన్ సభ ఫోటోలు తీసేందుకు వెళ్లిన శ్రీకృష్ణను వైసీపీ రౌడీలు చుట్టుముట్టి విచక్షణారహితంగా కాళ్లతో తన్నడం, పిడిగుద్దులు గుద్దడం చూస్తే చంపాలనే కుట్ర స్పష్టంగా కనిపిస్తుందన్నారు. సాక్షాత్తు సీఎం జగన్ ఒక వర్గం మీడియా అని మాట్లాడటం వల్ల ఆ పార్టీ శ్రేణులు సహనం కోల్పోయి దాడికి పాల్పడ్డారన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఈ దాడులకు సీఎం జగన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తక్షణమే దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టులు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అరాచకానికి నిదర్శనం

వైసీపీ అరాచకానికి నిదర్శనమే ఈ దాడి. సిద్ధం సభకు వెళ్లి అక్కడ ఫొటోలు తీస్తున్న శ్రీకృష్ణపై దాడి చేయడం దారుణం. ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియానుసైతం బెదిరిస్తున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో అరాచకాలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. సరైన సమయంలో బుద్ధిచెబుతారు.

- అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి



గుంటనక్కల దాడి

ఇది గుంటనక్కల దాడి. వైసీపీ వికృత చేష్టలకు ఈ సంఘటన నిదర్శనం. విధినిర్వహణలో భాగంగా సభ వద్ద కవరేజీ చేస్తుండగా దాడి చేయడం అమానుషం. కాళ్లతో తన్నుతూ, పిడిగుద్దులతో దాడిచేస్తుంటే ఎంతకు బరితెగించారో అర్థమవుతోంది. జర్నలిస్టులపై దాడికి పాల్పడటం ఉన్మాద చర్య. భౌతికదాడులకు పాల్పడటం సరైన పద్ధతి కాదు.

- సవిత, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



భయభ్రాంతులకు గురిచేస్తున్నారు



వైసీపీ అల్లరి మూకలు దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఓటమి భయంతోనే ఈవిధంగా ప్రవర్తిస్తున్నారు. అవినీతి, అక్రమాలను వెలికితీస్తున్నారనే ఈవిధంగా దాడులకు పాల్పడుతున్నారు. వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యానికి నీళ్లొదిలారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- వెంకటశివుడు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ



వైసీపీ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది. సిద్ధం బహిరంగ సభను కవరేజ్ చేయడానికి వెళ్లిన స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరిమూకలు దాడిచేయడం అప్రజాస్వామికం. మీడియాపై అధికార పార్టీ అనుచరగణం దాడులకు పాల్పడటం సబబుకాదు. దాడికి పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

- పెరుమాళ్ల జీవానందరెడ్డి, టీడీపీ నాయకులు

వెంటనే అరెస్టు చేయాలి



దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి. కఠినంగా శిక్షించాలి. రాష్ట్రంలో గూండాలు, రౌడీల పాలనకు ఇదే నిదర్శనం. జర్నలిస్టులపై దాడి ప్రతికా స్వేచ్ఛపై దాడిగా పరిగణించాల్సిందే అన్నారు.

- పర్వతనేని శ్రీధర్‌బాబు, టీడీపీ అధికార ప్రతినిధి

ముక్తకంఠంతో ఖండించాలి



ఈ దాడిని వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలి. లేనిపక్షంలో ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో మరిన్ని జరిగే అవకాశం ఉంటుంది. దాడి చేసిన, ప్రోత్సహించిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి.

- మాజీ జడ్పీటీసీ రామలింగారెడ్డి

దాడి అమానుషం



దాడి అమానుషం. దీనిని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అయినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

డేగలకృష్ణమూర్తి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి

వెంటనే చర్యలు తీసుకోవాలి



దాడిచేసిన వారిపై వెంటనే చర్యలుతీసుకోవాలి. సీఎం సభ నేపథ్యంలో కవరేజీకి వెళ్లిన వారిపై దాడి హేయమైన చర్య. వెంటనే చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు.

- దండు శ్రీనివాసులు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి

కేసు నమోదు చేయాలి..

శ్రీకృష్ణపై వైసీపీ గూండాలు దాడి చేయడం అమానుషం. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జర్నలిస్టులపై దాడులు పెరిగాయి. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలి. దాడులు పునరావృతం కాకుండా చూడాలి.

- టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి

సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు




బస్సు లేక ఖాళీగా ఉన్న కదిరి ఆర్టీసి బస్టాండ్, బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



నంబులపూలకుంటలో ..

● ప్రయాణికులకు తప్పని తిప్పలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 18 : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను పెద్దఎత్తున మళ్లించారు. దీంతో జిల్లాలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాప్తాడులో జరిగిన సభకు శనివారం సాయంత్రం నుంచే జిల్లా నుంచి సుమారు 450బస్సులను పంపారు. సభకు గ్రామాల నుంచి వైసీపీ శ్రేణులను తరలించడానికి ఈ బస్సులను నడిపారు. దీంతో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రయాణికులు సమయానికి బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అసలే జిల్లాలో ప్రయాణికులకు తగ్గట్టు పూర్తిస్థాయిలో బస్సులు లేవు. దీనికితోడు ఆదివారం అధిక బస్సులు సభకు వెళ్లడంతో ప్రయాణికుల కష్టాలు రెట్టింపయ్యాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంతోపాటు కదిరి, హిందూపురం, ధర్మవరం, పెనుకొండ, మడకశిరతోపాటు ప్రధాన మండలకేంద్రాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సులులేక ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వచ్చింది. జిల్లాలో పలు పెళ్లిళ్లు జరిగాయి. అయితే బస్సులు లేక చాలా మంది బంధువులు పెళ్లికి వెళ్లలేకపోయామని వాపోయారు. ఆర్టీసీ అధికారులు పార్టీ పెద్దల సభకు బస్సులను పంపడంతో ఇదేం చోద్యం అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

కదిరిఅర్బన్: రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు కదిరి ఆర్టీసీ డిపోలోని బస్సులన్నీ తరలించారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రాజకీయ సభకు ప్రభుత్వ బస్సులు పంపడం ఏమిటని ప్రయాణికులు మండిపడుతున్నారు. ముఖ్యంగా బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులు సమయానికి బస్సులు లేకపోవడంతో గంటల తరబడి బస్టాండ్‌లో పడిగాపులు కాయాల్సి వచ్చింది.

నంబులపూలకుంట/ ఓబుళదేవర చెరువు/ బత్తలపల్లి/ నల్లమాడ: రాప్తాడులో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు పంపడంతో, నంబులపూలకుంట, ఓబుళదేవర చెరువు, బత్తలపల్లి, నల్లమాడల మండలాల్లోని ప్రయాణికులతోపాటు ఇతర ప్రాంతాల వారు ఇబ్బందులు పడ్డారు. బస్సులేవీ లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాలనుంచి ఆటోలు, ద్విచక్రవాహనాల్లో మండలకేంద్రాలకు చేసుకుని, సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రధాన కూడళ్లలో గంటల కొద్దీ వేచి చూశారు. ఈ క్రమంలో వృద్ధులు, చంటిపిల్లలున్న తల్లులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిద్ధం తమ పాలిట నరకంగా మారిందని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు. చివరికి చేసేదిలేక వారంతా ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరకున్నారు.



ఓడీసీలో ..



బత్తలపల్లిలో ఎండలో ..



నల్లమాడలో..

టీడీపీతోనే ముస్లింల అభ్యున్నతి

● ఆత్మీయ సదస్సులో ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



టీడీపీలో చేరిన మైనార్టీలతో పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, ఫిబ్రవరి 18: ముస్లిం, మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. పరిటాల శ్రీరామ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముస్లిం, మైనార్టీలకు తెలుగుదేశం పార్టీలోనే న్యాయం జరుగుతుందన్నారు. పరిటాల కుటుంబం ఎప్పటికీ మైనార్టీలకు రుణపడి ఉంటుందన్నారు. మా తాత, తండ్రి వెంట ఎప్పుడూ ముస్లింలు ఉండేవారన్నారు. సైకో జగన్ ముస్లింలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారన్నారు. వైసీపీని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే.. ముస్లింల కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని 161 మంది మైనార్టీలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పరిటాలశ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తర్వాత ఆయన స్థానిక 1వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. స్థానిక సమస్యలను అడిగితెలుసుకున్నారు. స్థానికులు రోడ్లు, తాగునీటి సమస్యలను శ్రీరామ్ దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ధర్మవరం మైనార్టీ నాయకులు నాగూర్‌హుస్సేన్, అత్తార్‌రహీం, రాళ్లపల్లిషరీఫ్, బీబీ, సులేమాన్, సలీం, బాషా, మండల నాయకులు రమేష్‌బాబు, కరణంప్రభాకర్, తుమ్మలమనోహర్, కనుమచంద్ర, తుమ్మలనాయుడు, కోట్లబాబీ, వినోద్, ఆనంద్, శిరగారిపల్లి రవి, గడ్డంమోహన్, రాధమ్మ, అమీర్ బాషా, రెడ్డప్ప, అయూబ్, ఫిరోజ్, అనీఫ్, రంగనాయకులు, నారాయణస్వామి, సూరి, షరీఫ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



కదిరిఅర్బన్, ఫిబ్రవరి 18: మండలంలోని ఎర్రదొడ్డి, కాళసముద్రం పంచాయతీల పరిధిలోని పలువురు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కదిరి పట్టణంలోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు టీడీపీలోకి చేరారు. కందికుంట వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరినవారిలో ప్రతాప్‌రెడ్డి, వీరారెడ్డి, షామీర్, మహబూబ్‌బాషా, శ్రీరాములు, నాగభూషణ, శివకుమార్‌నాయక్, శాంతిబాయితోపాటు 50మంది ఉన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చెన్నకేశవులు, నాయకులు హరి, నర్సిరెడ్డి, పురుషోత్తం, శంకర్, ఉపేంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి, మోపూరి శెట్టి చంద్రశేఖర్, రాజశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారితో కందికుంట

ప్రపంచ విప్లవ మార్గదర్శి లెనిన్

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు

కదిరి అర్బన్, ఫిబ్రవరి18: ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన ప్రతి ప్రజా ఉద్యమంలో మనిషి తన విముక్తి కోసం సాగించిన విప్లవ పోరాటంలో లెనిన్ మార్గదర్శిగా నిలిచారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాం భూపాల్ పేర్కొన్నారు. కదిరి పట్టణంలోని సైదాపురం అంజనేయస్వామి అలయంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎల్ఐసీ అభివృద్ధి అధికారి పిళ్లా కుమార్‌స్వామి రచించిన లెనిన్ నేడు లేడు.. చూడు జనంలో ఉన్నాడు.. అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ లెనిన్ జీవించిన 54 ఏళ్ల కాలంలో నిత్యం పీడిత ప్రజల కోసం ఆలోచించారన్నారు. ప్రజలు సుఖంగా జీవించడానికి అవసరమైన ఓ నూతన సామాజిక వ్యవస్థను నిర్మించేందుకు ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన ప్రజా ప్రణాళికలు రూపొందించారన్నారు. తన జీవిత కాలమంతా పీడిత ప్రజల బాగుకోసం పని చేశారన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు నిర్వహించి రష్యాలో విప్లవాన్ని సాధించారని గుర్తు చేశారు. సమాజం కోసం పని చేసిన లెనిన్ కృషిని పుస్తక రూపంలో పిళ్లా కుమార్‌స్వామి తీసుకురావడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు సుబ్బిరెడ్డి, జీఎల్ నరసింహులు, రాజేంద్ర, రమణ, రామకృష్ణ, బాబ్‌జాన్, ప్రజాసంఘాల నాయకులు యాకుబ్‌ఖాన్, లియాజ్, మాబున్నీసా, శాంతిబాయి, రామమోహన్, జగన్, ముస్తాక్, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జూపూడి ప్రభాకర్ వ్యాఖ్యలు శోచనీయం'

కదిరి, ఫిబ్రవరి 18: అంబేడ్కర్ విదేశీ విద్య పథకం పేరు మార్పు చేయాలంటూ జూపూడి ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు శోచనీయమని టీడీపీ నాయకులు ఖండించారు. పట్టణంలోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్ విదేశీ విద్య పథకానికి సీఎం జగన్ పేరు అయినా పెట్టి నడిపించాలని ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారుడు జూపూడి ప్రభాకర్ అనడం దురదృష్టకరమన్నారు. ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్, నాయకులు విశ్వనాథ్, రామాంజి, చిన్నప్ప, గంగాధర్, నరసింహ, కిష్టప్ప, హరి తదితరులు ఉన్నారు.

కష్టపడి కాదు.. ఇష్టపడి చదవండి

తనకల్లు, ఫిబ్రవరి 18: కష్టపడి కాదు, ఇష్టపడి చదవాలని ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ అండ్ విజిలెన్స్ సభ్యుడు గంగులయ్య విద్యార్థినులకు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఆయన వెంట మానవహక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా వర్కింగ్ చైర్మన్ కోటకొండ కిష్టప్ప, కదిరి డివిజన్ చైర్మన్ మునేంద్ర, ఉపాధ్యాయులు ఉన్నారు.

అలాగే గంగులయ్య స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇక్కడి వసతి గృహంలో 42మంది పిల్లలుండాల్సి ఉండగా కేవం 21మంది మాత్రమే ఉన్నారన్నారు. మెనూ ప్రకారం టిఫిన్ అందించడం లేదని తెలిసిందన్నారు. ఈవిషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పోతుకుంటలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి18: మండలంలోని పోతుకుంట గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఇంటికీ వెళ్లి మినీమేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంచుతూ పథకాల గురించి తెలియజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు గొట్లూరు శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలు మేలు జరుగుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, నాయకులు విజయసారథి, రాఘవరెడ్డి, తలారి వెంకటలక్ష్మి, పోతలయ్య, పోతుకుంటరవి, గరుడంపల్లి చంద్రశేఖర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ముష్టూరు పంచాయతీలో..

బత్తలపల్లి: మండలంలోని ముష్టూరు పంచాయతీలో టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు కరణంసూర్యప్రకాష్‌రావు, జక్కంపూటి నాగభూషణ, నాగేలి లక్ష్మినారాయణ, తాళ్లూరి సతీష్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోతుకుంటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రన్నతోనే యువతకు భవిష్యత్తు

నల్లమాడ, ఫిబ్రవరి 18: యువత భవిష్యత్తు చంద్రన్నతోనే సాధ్యమని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని స్వాతి క్లినిక్‌లో ఆదివారం ఆయన వై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ మొదటిసారి ఓటు వినియోగించుకునే యువత ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. భవిష్యత్తు బాగుడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఆయనతోనే ఉపాధి అవకాశాలు మెండుగా వస్తాయని తెలిపారు. వచ్చేఎన్నికల్లో మొదటి ఓటు ఆయనకే వేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, గన్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, ఆటో మహబూబ్‌బాషా, చంద్రమోహన్‌రెడ్డి,అగ్గిరాముడు, రవికుమార్, గంగాద్రి, రమణ, పల్లపు ప్రసాద్ పాల్గొన్నారు.

పుట్టపర్తిరూరల్: మున్సిపల్ పరిధిలోని తారకరామ కాలనీలో సామకోటి ఆదినారాయణ వైఫస్ట్‌ఓట్ ఫర్ సీబీఎన్ పోస్టర్‌పై యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం ఎంతో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా కల్పిస్తారని అన్నారు. ఆయన్ను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మొదటిసారి ఓటుహక్కు పొందిన యువత వచ్చే ఎన్నికల్లో ఓటును తప్పక వినియోగించుకోవాలని సూచించారు. తెలుగుయువత నాయకులు కరుణాకర్, శ్రీనివాసులు, నవీన్, ప్రకాష్ ఉన్నారు.



నల్లమాడలో పోస్టర్లు విడుదల చేస్తున్న సామకోటి తదితరులు

సిద్ధం సభకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి దూరం

● అదే బాటలో పలువురు ప్రజాప్రతినిధులు

కదిరి, ఫిబ్రవరి 18: రాప్తాడులో ఆదివారం వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు ఎమ్మెల్యే సిద్ధారెడ్డి దూరమయ్యారు. ఆయనతో పాటు ఆయనవర్గీయులైన పలువురు కౌన్సిలర్లు, ఎంపీ పీ, ఇతర ప్రజాప్రతినిధులు కూడా దూరంగా ఉన్నారు. రాయలసీమ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్మాత్మకంగా నిర్వహించిన ఈ సిద్ధం సభకు ఎమ్మెల్యే దూరమవడంపై పలువురు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. మంత్రి పెద్దిరెడ్డి స్వయంగా వచ్చి బతిమిలాడినా.. ఎమ్మెల్యే సిద్ధం సభకు హాజరుకాలేదు. తనను కాదని, తానుండగానే మరొకరికి నియోజకవర్గ ఇన్‌చార్జిగా మరొకరిని నియమించడంతో ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. అదే సమయంలో నియమించిన కొత్త ఇన్‌చార్జి కూడా ఆయన్ను కలుపుకుని పోకపోవడంతో ఎమ్మెల్యే మరింత ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. దీంతో ఆయనతో పాటు ఆయన వర్గీయులు వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. సిద్ధం సభకు ఆయన వ్యతిరేక వర్గీయులు వెళ్లారే తప్పా ..మిగిలినవారంతా హాజరుకాలేదు.

బస్సుల్లో సీటుకు ఒక్కరే..

సిద్ధం సభకు వెళ్లడానికి నియోజకవర్గ వ్యాప్తంగా 225 బస్సులను ఏర్పాటు చేసినట్లు వైసీపీ నాయకులే చెబుతున్నారు. ఈ బస్సులు నింపలేమని కార్యకర్తలు మండల సమావేశాల్లో తేల్చి చెప్పినట్లు సమాచారం. అయినా బస్సులు పంపడంతో ఖాళీగా ఉన్న బస్సుల్లో సీటుకొక్కరు కూర్చున్నట్లు కనిపించింది. ఏబస్సులో చూసినా.. పది, పదిహేను మంది కంటే ఎక్కుమంది కనిపించలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. మొత్తం మీద నియోజకవర్గంనుంచి పదివేలమంది వస్తారని ఆశిస్తే, కేవలం ఐదారువేలమందే వెళ్లినట్లు సమాచారం.

పలు గ్రామాల్లో బోర్లకు మరమ్మతులు

బత్తలపల్లి, ఫిబ్రవరి 18: గ్రామాలలో పని చేయని తాగునీటి బోర్లు, చేతిపంపులను సొంత నిధులతో బాగు చేయించి వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ నడుం బిగించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో చెడిపోయిన బోర్లను రిపేరి చేయించాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని తన అనుచరులను ఆదేశించారు. ఈ క్రమంలో మండలంలోని గంటాపురం,అప్రాచెరువు,ముద్దనపల్లి,సంగమేశ్వరం గ్రామాలలో ఆదివారం మాజీ గోనుగుంట్ల అనుచరులు చెడిపోయిన బోర్లను రిపేరి చేయించారు దీంతో ఆయ గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.



గంటాపురంలో పంచాయతీ బోరును రిపేరి చేయిస్తున్న గోనుగుంట్ల అనుచరులు

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దారుణం

కదిరి, ఫిబ్రవరి 18: రాప్తాడులో ఆదివారం వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలో కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి జరగడం దారుణమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోపూరి శెట్టి చంద్రశే ఖర్, పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్‌తో పాటు పలువురుఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసీపీ అల్లరి మూకలు మీడియా ప్రతినిధిపై దాడి చేయడం అత్యంత హేయమన్నారు. ఈ దాడి పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. ఇలాంటి దారుణాలు చేయడం వైసీపీ వారికి అలవాటైందన్నారు. దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

భక్తి శ్రద్ధలతో మధ్వనవమి

పెనుకొండ, ఫిబ్రవరి 18: పట్టణంలోని మంత్రాల యం రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మధ్వనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు కుప్రేషాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్వాచార్యుల చిత్రపటాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం బ్రాహ్మణ అన్నసం తర్పణ గావించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాలూరి కృష్ణమూర్తి, బీహెచ్ శ్రీనివాసులు, నాగేంద్రతో పాటు మధ్వసంఘం నాయకులు పాల్గొన్నారు.

మద్యం కోసం ఎగబడిన వైసీపీ శ్రేణులు

కదిరి అర్బన్ , ఫిబ్రవరి 18: సిద్ధం సభకు వెళ్తున్న వైసీపీ శ్రేణులు పట్టణంలోని సైదాపురంలో గల మద్యందుకాణం వద్ద మద్యం కోసం ఎగబడ్డారు. ఒక్కొక్కరికి రెండు క్వార్టర్ బాటిళ్ల చొప్పున నాయకులు పంపిణీ చేశారు. దీంతో దుకాణం వద్ద పెద్ద సంఖ్యలో శ్రేణులు గుమ్మికూడారు.



సైదాపురంలో మద్యం దుకాణం వద్ద గుమికూడిన వైసీపీ శ్రేణులు

ఓబుళదేవర చెరువు: వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు మందుబాబులను తరలించడానికి నాయకులు చుక్క, ముక్క ఎర చూపారు. బస్సు ఎక్కినప్పటినుంచి మందుబాబులు మద్యం సేవిస్తూ.. సభకు వెళ్లారు. ఇక చాలా గ్రామాల్లో జనాలు సిద్ధం సభకు వెళ్లడానికి ఆసక్తి చూపకపోవడంతో వలంటీర్లు సభకు రాకపోతే పథకాలు రద్దు అవుతాయని, పింఛన్ తొలగిస్తారని, ముందు ముందు ఇబ్బందులు పడతారని చెప్పి మరీ సభకు తరలించాల్సిన పరిస్థితి నెలకొంది.

నందమూరి తారకరత్నకు ఘన నివాళి

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి18: సినీ నటుడు, టీడీపీ రాష్ట్రనాయకుడు నందమూ రి తారకరత్న మొదటివర్థంతి సందర్భంగా ఆదివారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ అనంతపురంలోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆప్తమిత్రుడు తారకరత్న దూరమై అప్పుడే ఏడాది గడిచిందన్నారు. ఆయనతో గడిపిన క్షణాలు నేటికి గుర్తున్నాయన్నారు. తారకరత్న పార్టీకోసం చేసిన సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో ఎన్టీఆర్ అభిమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ నరేంద్రచౌదరి, ధర్మవరపు బాలాజీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



తారకరత్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాలశ్రీరామ్ తదితరులు

సిద్ధం సభకు రండి బాబూ.. రండి

● బస్సు వద్ద ఎంపీటీసీ సభ్యుడి పడిగాపులు

కొత్తచెరువు, ఫిబ్రవరి 18: రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు జనాన్ని తరలించడానికి వైసీపీ నాయకులు పడరాని పాట్లు పడ్డారు. మండల కేంద్రంలో బస్సులు ఏర్పాటు చేసినా ఎవరూ రాలేదు. దీంతో వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు సిద్ధం సభకు రండి బాబూ.. రండి అంటూ అందరికీ ఫోన్లు చేస్తూ బస్సు వద్ద జనం కోసం గంటల తరబడి పడిగాపులు కాశారు. సభకు జనాన్ని తరలించేందుకు ఒక్కొక్క బస్సుకి రూ. 10 వేలను నాయకులకు పార్టీ అధిష్ఠానం అందజేసినట్లు సమాచారం. కాగా కొందరు నాయకులు ఆ డబ్బును పంచకపోవడంతో జనం ఎవరూ రాలేదు. దీంతో చాలా బస్సులు సభా ప్రాంగణానికి ముగ్గురు నలుగురితో ఖాళీగా వెళ్లాయి. మరికొన్ని చోట్ల మహిళలకు రూ. 300లు, పురుషులకు రూ. 500లు ఇచ్చి తరలించినట్లు ఆ పార్టీ నాయకులు బహిరంగంగా చెప్పుకోవడం గమనార్హం.



బస్సు వద్ద జనం కోసం వేచిచూస్తున్న ఎంపీటీసీ సభ్యుడు

యాసిన్ సూరా ఫొటోల పంపిణీ

ముదిగుబ్బ, ఫిబ్రవరి18: మండల కేంద్రంలోని సాయినగర్‌లో గల ముస్లిం కుటుంబాలకు ఆదివారం టీడీపీ హిందూపురం పార్లమెంటరీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాగూర్ హుస్సేన్ పలు మైనార్టీ నాయకులతో కలిసి యాసిన్ సూరా ఫొటోలను పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు అత్తార్‌రహీం, నాయకులు రాళ్లపల్లి షరీఫ్, సులేమాన్, ఈరూరిబాషా, సలీం, రెడ్డప్ప, షమీ, షాహీర్, ఇమాములు, మహబూబ్‌బాషా, అమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

'జగన్ మళ్లీ వస్తే.. అభివృద్ధి వందేళ్లు వెనక్కు'

ధర్మవరం, ఫిబ్రవరి18: జగన్‌కు మరోసారి అధికారం ఇస్తే రాష్ట్రం అభివృద్ధిలో మరో వందేళ్లు వెనక్కు వెళుతుందని జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక్క చాన్స్ అంటూ గద్దెనెక్కిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. ఇప్పటికీ రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందంటే అది జగన్ పుణ్యమేనని ఎద్దేవా చేశారు. ఏటా జాబ్‌క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఇక రైతులకు ఆయన చేసిందేమీ లేదని మండిపడ్డారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో సిద్ధం సభలను నిర్వహిస్తూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. రాప్తాడు సభలో జనాన్ని చూసి సీఎం జగన్ మురిసిపోతున్నారని, ఆ జనాలు స్వచ్ఛందంగా వచ్చిన వారు కాదని అన్నారు. వలంటీర్లు, వైసీపీ ప్రజాప్రతినిధులు బెదిరిస్తే తప్పని పరిస్థితుల్లో సభకు వచ్చారని దుయ్యబట్టారు.



మాట్లాడుతున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

భక్తి శ్రద్ధలతో మధ్వనవమి



మధ్వాచార్యుల విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పెనుకొండ, ఫిబ్రవరి 18: పట్టణంలోని మంత్రాలయం రామవేంద్రస్వామి మఠంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మధ్వనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు కుప్రేషాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్వాచార్యుల చిత్రపటాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం బ్రాహ్మణ అన్నసంతర్పణ గావించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాలూరి కృష్ణమూర్తి, బీహెచ్ శ్రీనివాసులు, నాగేంద్రతో పాటు మధ్వసంఘం నాయకులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మడకశిర టౌన్, ఫిబ్రవరి 18: మాఘమాసం 9వ రోజు ఆదివారం పట్టణంలోని చంద్రమౌళీశ్వరని ప్రత్యేకంగా వీరభద్రస్వామి అలంకరణలో కొలువుదీర్చారు. స్వామి వారికి విశేష పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కోటవెంకటేశ్వరస్వామి, మిట్టబండ ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, వీరభద్రేశ్వర, బోరామలింగేశ్వర, మూలకంఠేశ్వరి, పూజమ్మదేవి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామికి ప్రాకారోత్సవం నిర్వహించారు.

కోడి రంగనాథస్వామి రథోత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న కోడి రంగనాథస్వామి రథం

లేపాక్షి, ఫిబ్రవరి 18: మండలంలోని శిరివరం గ్రామంలో వెలసిన అతిపురాతన కోడిరంగనాథస్వామి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక రథంలో అధిరోహించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

శ్రీవారికి హనుమద్ వాహన సేవ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 18: పట్టణ పరిధిలోని ప్రసిద్ధి చెందిన పేట వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ వారు హనుమద్ వాహనంపైఊరేగారు. పురవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, గోవిందనామ స్మరణతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు పురవీధుల్లో ఊరేగారు.

నందమూరి తారకరత్న వర్ధంతి

పెనుకొండ, ఫిబ్రవరి 18: ప్రముఖ సినీనటుడు నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతిని ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి కుమారుడు సాయికళ్యాణ్ ఆధ్వర్యంలో తారకతర్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మునిమడుగు వెంకట రాముడు, శశికుమార్ పటేల్, కన్వీనర్లు రవిశంకర్, కన్నాస్వామి, పులగూర్ల శ్రీనివాసులు, సాయిప్రసాద్, చంద్రగిరి పోలిరెడ్డి, గుట్టూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశావాది జ్ఞాపకార్థం అన్నదానం

పెనుకొండ, ఫిబ్రవరి 18 : ప్రముఖ కవి, అష్టావధాని, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆశావాది ప్రకాశరావు జ్ఞాపకార్థం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం నారాయణసేవ కార్యక్రమంలో భాగంగా సంతకు వచ్చిన గ్రామీణ ప్రాంత ప్రజలకు, పేదలకు, యాచకులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావాది కుమార్తె శ్రీవల్లి మనమరావు సంగీత, సత్యసాయిసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి తీవ్రగాయాలు

చిలమత్తూరు, ఫిబ్రవరి 18: మండలంలోని 44వ జాతీయ రహదారిపై కొడికొండ సమీపంలోని పంజాబి డాబా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. చిలమత్తూరుకు చెందిన రామారావు, మండలంలోని మొరంపల్లికి చెందిన రామచంద్రారెడ్డి ద్విచక్రవాహనంలో పంజాబీ డాబా వద్దకు వెళ్లారు. రామారావు డాబా వద్ద దుకాణం పెట్టే విషయం మాట్లాడటానికి వెళ్లినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. అయితే అక్కడ డాబా యజమానితో మాట్లాడి అనంతరం ఇద్దరూ ద్విచక్రవాహనంలో కొడికొండ చెక్‌పోస్టు వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న మినీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామచంద్రారెడ్డి (55) అక్కడికక్కడే మృతి చెందగా, రామారావు తీవ్రంగా గాయపడ్డాడు. మృతిచెందిన రామచంద్రారెడ్డికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

తిప్పరాజుపల్లి పొలాల్లో కొండచిలువ



అటవీ అధికారులకు పట్టుబడిన కొండచిలువ

గోరంట్ల, ఫిబ్రవరి 18: మండలంలోని తిప్పరాజుపల్లి సమీపంలోని పంట పొలాల్లో కొండచి లువ సంచారించడాన్ని ఆదివారం రైతులు గుర్తించారు. ఆందోళన చెందిన రైతులు వెంటనే అటవీశాఖాధికారులకు ఫోన్‌ద్వారా సమాచారం అదించారు. అటవీ అధికారులు రాహుల్, రామక్రిష్ణ వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని, హనుమంతరెడ్డి సాగుచేసిన టమాట పంటను క్షుణంగా పరిశీలించారు. పొలం సమీపంలో కొండలో ఉన్న కొండ చిలువను గుర్తించి పట్టుకున్నారు. ప్లాస్టిక్ సంచిలో దానిని బంధించారు. 16 కిలోల బరువు, ఆరు అడుగుల పొడవు ఉన్న కొండచిలువకు మూడేళ్ల వయస్సుంటుందదన్నారు. దానిని సమీపంలోని గంగపంపల్లి అటవీ ప్రాంతాల్లో వదిలిపెట్టినట్లు అధికారులు తెలిపారు.



పురంలో బస్సులులేక వెలవెలబోతున్న ఆర్టీసీ బస్టాండు



ఆర్టీసీ బస్టాండులో వేచివున్న ప్రయాణికులు

బస్సులన్నీ సిద్ధం సభకే!

● వెలవెలబోయిన ఆర్టీసీ బస్టాండు

● ప్రయాణికులకు తప్పని తిప్పలు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లాలోని రాప్తాడు వద్ద ఆదివారం నిర్వహించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు స్థానిక డిపోకు చెందిన దాదాపు మూడొంతులకుపైగా ఆర్టీసీ బస్సులను పంపారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి బస్సులు లేక స్థానిక బస్టాండు బోసిపోయింది. ఈ విషయం తెలియక ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చిన ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఎంతో సేపు వేచి ఉండి ఆర్టీసీ సిబ్బంది ద్వారా అన్ని బస్సులు సీఎం సిద్ధం సభకు తరలించినట్లు తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే హిందూపురం నుంచి అనంతపురానికి వెళ్లే దారి మళ్లించారు. దీంతో మామిళ్లపల్లి వద్ద క్రాస్ తీసుకొని కళ్యాణదుర్గం నుంచి అనంతపురం చేరాల్సి ఉంటుంది. దీందో వంద కిలో మీటర్లు దూరం, మూడు గంటలు అదనంగా ప్రయాణం చేయాల్సి ఉంటుంద. దీంతో చాలామంది ప్రయాణికులు అంత వ్యయ ప్రయాసలు ఎందుకని ప్రయాణం విరమించుకుని వెనుతిరిగినట్లు సమాచారం. మరి కొంత మంది రైళ్లలో వెళ్లారు. ఆదివారం సాయంత్రం యశ్వంతపురం, బీదర్ రైళ్లఒంటి కాలుపై ప్రయాణించారు. కొంత మంది ప్రమాదకరంగా డోరు పట్టుకొని నిలుచున్నారు. చిన్న పిల్లలు ఉన్నవారి అవస్థలు వర్ణనాతీతం. బస్సులు లేక పోవడంతోనే ఈ విషమ పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆగ్రహించారు..



రైలులో ప్రయాణికుల పరిస్థితి

మడకశిర : స్థానిక ఆర్టీసీ డిపోలో ఉన్న 32 బస్సుల్లో 23 బస్సులను సిద్ధం సభకు పంపారు. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మండు టెండలో బస్టాండు, కూడళ్ల లోను వేచి ఉండే పరిస్థితి నెలకొంది.

రొద్దం: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు రావాల్సిన ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పావగడ, పెనుకొండ వైపు వచ్చే స్సులు సకాలంలో రాకపోవడంతో గంటల తరబడి వేచి చూశారు.



మడకశిరలో మండు టెండలో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు



రొద్దంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

సిద్ధంకాని వైసీపీ శ్రేణులు

ఖాళీగా వెళ్లిన బస్సులు



పరిగి మండలం నుంచి ఐదారుగురితో వెళ్తున్న బస్సు

హిందూపురం, ఫిబ్రవరి 18: వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సిద్ధం బహిరంగ సభకు హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల నుంచి జనం అంతంత మాత్ర మే వెళ్లారు. హిందూపురం నియోజకవర్గం నుంచి 10వేల మందిని తరలించాలని స్థానిక నాయకులకు ముఖ్య నేతలు హుకుం జారీచేశారు. పెనుకొండ నియోజకవర్గంలో కూడా ఇలాగే చెప్పారు. ప్రతి వార్డుకు, పంచాయతీకి రెండు బస్సులు చొప్పు న కేటాయించారు. అయితే మధ్యాహ్నం ఒంటి గంట దాటినా జనం రాకపోవడంతో హిందూపురం ప్రాంతంలోనే బస్సులు ఆగాల్సిన పరిస్థితి వచ్చింది. అందులో ఒక్కో బస్సులో ఐదు నుంచి 10మంది ఎక్కారు.

పట్టణం నుంచి కదలని జనం

హిందూపురం పట్టణం నుంచి జనాన్ని అధిక సంఖ్యలో తరలించాలని వైసీపీ సమన్వయకర్త దీపిక, ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్‌నిశ్చల్ మీడియా సమావేశాల్లో పేర్కొన్నారు. ఆదివారం నవీన్‌నిశ్చల్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా 20కార్లలో వెళ్లారు. దీపిక ఆధ్వర్యంలో నియోజకవర్గానికి 150 బస్సులని చెప్పారు కానీ, బస్సులన్నీ పల్లెలకు వెళ్లాయి. పట్టణంలో ఎక్కడా ఆ బస్సులు కనిపించలేదు. దీంతో పట్టణానికి చెందిన ముఖ్య నాయకులు కూడా హిందూపురంలోనే నిలిచిపోయారు.

పల్లెల నుంచీ అంతంతే..!

సిద్ధం బహిరంగ సభకు పల్లెల నుంచి కూడా జనం కరువయ్యారు. కొటిపి పంచాయతీలో ఆ పార్టీకి బలమైన నాయకులు ఇద్దరుండగా... అందులో ఒక సర్పంచ్ ఉన్నారు. అక్కడి నుంచి 15మంది మాత్రమే వెళ్లినట్లు ఆ పార్టీ నాయకుల నుంచి సమాచారంరు. మాజీ మండల కన్వీనర్ పంచాయతీ నుంచి పట్టుమని పది మంది కూడా వెళ్లలేదు. పల్లెల్లో భోజనాలు పెడతామని, మద్యం ప్యాకెట్లు ఇస్తామని చెప్పినా బస్సు ఎక్కలేదని సమాచారం. దీంతో ఖాళీగా బస్సులు వెళ్లాల్సి వచ్చిందని ఆ పార్టీ నాయకులు చెప్పుకున్నారు.

మార్గమధ్యలో బస్సుల కుదింపు

సిద్ధం బహిరంగసభకు బస్సులు పెట్టారు కానీ జనం రాకపోవడంతో హిందూపురం మండలం మణేసముద్రం దాటాక ఐదు బస్సుల్లో ఉన్న జనాన్ని ఒక బస్సులోకి తరలించారు. ఇందులో కూడా పల్లెవెలుగు బస్సులు పక్కనబెట్టి ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రం పంపారు. దీంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన టూరిస్ట్ బస్సులను వెనక్కు పంపారు. మరికొన్ని బస్సులైతే హిందూపురంలోనే ఎక్కడికక్కడ ఆపేశారు.



హిందూపురంలోనే ఆగిపోయిన టూరిస్ట్ బస్సు

ఘనంగా ఉజ్జినప్ప రామప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మడకశిర రూరల్, ఫిబ్రవరి 18: మండలంలోని భీమరాయనపల్లిలో ఉజ్జినప్ప రామప్ప స్వామి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సాయంత్రం 4 గంటల నుంచి మహాగణపతి పూజ, గంగపూజ, గోపూజ, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి నూతనంగా నిర్మించిన ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణతో ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చా మొక్కులు తీర్చుకున్నారు.

సత్తా చూపడానికి మేమూ సిద్ధం

ఉద్యోగ సంఘాల నాయకులు

గోరంట్ల, ఫిబ్రవరి 18: తమ సమస్యల సాధన కోసం శాంతియుతంగా చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ప్రభుత్వం ఉద్యోగులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్బంధించిదని, రాబోవు ఎన్నికల్లో తాము ఏకమై సత్తా చూపడానికి సిద్ధంగా ఉన్నట్లు ఉద్యోగులు తెలిపారు. గోరంట్ల మండలంలో శనివారం పోలీసుల ద్వారా నోటీసులు అందుకున్న ఉపాధ్యాయులు అశోక్, సురేష్‌బాబు, బాలక్రిష్ణ, సుబాష్‌నాయక్ ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన వారంరోజుల్లోగా సీపీఎస్ రద్దుచేసి, ఇళ్లస్థలాలిస్తామని, మెరుగైన పీఆర్‌సీ ఇస్తామంటూ గత ఎన్నికల సమయంలో రకరకాల హామీలు గుప్పించిన ముఖ్యమంత్రి జగన్ మాట మరిచారన్నారు. ఆ హామీలు ఒక్కశాతం కూడా నేరవేర్చలేదన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రశ్నించడానికి తమ ర్యాలీలు, ధర్నాలకు అనుమతి ఇచ్చికూడా నిర్బధించడం, కేసులు పెట్టడం, నోటీసులివ్వడం ప్రభుత్వానికి తగదన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి, మూడు డీఏలను మంజూరు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిందన్నారు. ఆ రాష్ట్రంలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 24 స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించిన విషయాన్ని గుర్తు చేశారు.

అంగన్‌వాడీలకు అభినందన సభ

రొద్దం, ఫిబ్రవరి 18 : తమ పలు సమస్యల పరిష్కారం కోసం ఇటీవల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు 42రోజుల పాటు ఏకదాటిగా సమ్మె కొనసాగించినందుకు, వారికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆదివారం రొద్దం పాఠశాలలో జరిగిన సభలో సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ... అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేశారన్నారు. ప్రభు త్వం వారి సమస్యలు పరిష్కరించకపోగా మెడపై కత్తి పెట్టి సమ్మె విరమిం పజేసేలా ఒత్తిడి తెచ్చిందని విమర్శించారు. కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

టీడీపీ అనుబంధ కమిటీల నియామకం

రొళ్ల, ఫిబ్రవరి 18 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మడకశిర అసెంబ్లీ నియోజకవర్గంలోని రొళ్ల మండలానికి సంబంధించి అనుబంధ కమిటీల నియామక జాబితాను ఆదివారం విడుదల చేశారు. బీసీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా బీ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఈఎం నాగరాజు, తెలుగు యువత కమిటీ అధ్యక్షుడిగా ఉమేష్, ప్రధాన కార్యదర్శిగా కేబీ రాజన్న, టీఎన్ఎస్ఎఫ్ కమిటీ అధ్యక్షుడిగా చంద్రరాజు, ప్రధాన కార్యదర్శిగా శాంతరాజును నియమించారు. అదేవిధంగా టీఎన్‌టీయూసీ కమిటీ అధ్యక్షుడిగా దొడ్డలింగప్ప, ప్రధాన కార్యదర్శిగా రామన్న, ఎస్సీసెల్ కమిటీ అధ్యక్షుడిగా నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శిగా మంజునాథ, ఎస్టీసెల్ కమిటీ అధ్యక్షుడిగా హనుమంతనాయక్, ప్రధాన కార్యదర్శిగా మంజునాయక్ నియమించారు. తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలిగా రత్నమ్మ, ప్రధాన కార్యదర్శిగా కమలమ్మ, తెలుగు రైతు కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శిగా కెంపరాజు, మైనార్టీ కమిటీ అధ్యక్షుడిగా మహ్మద్ రఫీక్, ప్రధాన కార్యదర్శిగా ఇస్మాయిల్‌సాబ్ పేర్లను ఖరారు చేసినట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రాణాలు పోతేగానీ స్పందించరా?

రోడ్డుకు సేఫ్టీవాల్స్ నిర్మించాలంటూ బీఎస్పీ నిరసన

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 18: ప్రమాదాలు జరిగి ప్రాణాలో పోతేకానీ వంతెన వద్ద రోడ్డు కు సేఫ్టీవాల్స్ ఏర్పాటు చేయరా అని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు ఎన్‌హెచ్ హైవే అథారిటీ అధికారులను ప్రశ్నించారు. బీఎస్పీ నాయకులు ఆదివారం మోతుకపల్లి పెన్నానదిపై నూతనంగా నిర్మంచిన బ్రిడ్జి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడతూ.... పెన్నానదిపై పాత వంతెన కూలడానికి సిద్ధంగా ఉండటంతో అప్పట్లో బిఎస్పీ ఆధ్వర్యంలో పె ద్ద ఎత్తున ధర్నాలు చేపట్టామన్నారు. దాని ఫలితంగా నూతన వంతెన ఏర్పాటు చేశారన్నారు. కానీ వంతెనకు ఆనుకొని దాదాపు 20 అడుగుల లోతైన ప్రాంతం ఉందన్నారు. వంతెన వంకరగా ఉండటంతో వేగంగా వచ్చే వాహనాలు ఆ మలుపును గమనించక లోయలోకి దూసుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందారు. అందులో పడి ప్రాణాలు పోతేకాని హైవే అథారిటీ అధికారులు స్పం దించరేమో అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు హైవే అథారిటీ అధికా రులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి హరికుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు నాజీమ్‌బాషా, కోశాధికారి ఎమ్మెల్ నారాయణ, నాయకులు జంపుల నాగరాజు, మౌలాలి, కొట్నూరు గంగప్ప తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చిలమత్తూరు, ఫిబ్రవరి 18: ఒకప్పటి బాల్య స్నేహితులు మూడు దశాబ్దాల తరువాత కలుసుకున్న సందర్భంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని సంతోషంగా గడిపారు. మండలంలోని కొడికొండ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో 1991-92 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో సుమారు 30 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒక్కసారిగా కలుసుకోవడంతో అందరూ బాలలుగా మారి ఆనందోత్సాహాలతో తమ అమూల్యమైన సమయాన్ని కొద్ది గంటల పాటు గడిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి అప్పటి ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, జమాల్ బాషా ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. వారిని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మన్సూర్, హరినాథ్‌రెడ్డి, అహమ్మద్, శివన్న, వేణుగోపాల్, సురేంద్రరెడ్డి తదితరులు హాజరయ్యారు.



కొడికొండ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

80కి.మీ. అవతల పార్కింగ్

అవస్థలు పడ్డ ప్రైవేటు వాహనదారులు



కృష్ణదేవరాయల వైజంక్షన్ వద్ద పార్కింగ్‌లో నిలిపిన లారీలు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 18 : అధికారం ఉందికదా అడిగేవారు లేరని ముఖ్యమంత్రి సిద్ధం సభకు 80కి.మి. దూరంలో ప్రైవేట్ వాహనాలను పార్కింగ్‌కు ఉంచారు. మధ్యాహ్నం 3గంటలకు రాప్తాడులో బహిరంగ సభ ఉండటంతో బెంగళూరు నుంచి అనంతపురం మీదుగా హైదరాబాదు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ వాహనాలను పెనుకొండ శ్రీకృష్ణదేవరాయల వైజంక్షన్‌లోనే నిలిపి వేశారు. ఉదయం 10గంటల నుంచి సభ ముగిసేవరకు వాహనాలను వెళ్లనీయ లేదు. దీంతో వాహన యజమానులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యమంత్రి సభకు రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న పోలీసుల తీరుపై మండిపడ్డారు. అధికార మదంతో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్ , ఫిబ్రవరి 18: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ నియోజకవర్గంలో టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సిద్ధం సభరోజే వైసీపీకి మడకశిరలో షాక్ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి అధ్వర్యంలో మడకశిర పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మండల పరిధిలోని ఆమిదాలగొంది పంచాయతీ టీడీపల్లి గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నాయి. వైసీపీకి చెందిన నాగరాజు, వరలక్ష్మి, గంగమ్మ, రత్నమ్మ, లక్ష్మీబాయి, రంగమ్మ, శ్యామల, రాజు తదితరులతో పాటు వారి అనుచరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని, సీఎం జగన్‌రెడ్డి వల్ల అభివృద్ధి శూన్యం అని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయాన్ని ఎవరు ఆపలేరని జోస్యం చెప్పారు.

రైతు నాయకుల అరెస్టు అప్రజాస్వామికం: గుండుమల

పుట్టపర్తి జిల్లా కేంద్రంలో రైతు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్లిన రైతు సంఘం నాయకులు అరెస్టు చేయడం ఎంత వరకు న్యాయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు గుండుమల తిప్పేస్వామి ప్రశ్నించారు. ఆయన ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులను పూర్తిగా విస్మరించారని అన్నారు. పేరుకు మాత్రం రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో రైతులు జగన్‌కు బుద్ధి చెబుతారన్నారు. వెంటనే రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మినారాయణ, ప్రదాన కార్యదర్శి కోట్ల రంగేగౌడ్, పట్టణ అధ్యక్షుడు మనోహర్ తదితరులు ఉన్నారు.

రాయలసీమ ద్రోహి జగన్: సవిత



సమావేశంలో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 18: రాయలసీమ నమ్మకద్రోహి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత విమర్శించారు. ఆమె ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హామీలు ఇచ్చి మోసం చేసిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని, రాయలసీమలోకి ఏముఖం పెట్టుకుని సిద్ధం సభకు వచ్చాడని అన్నారు. జగన్మోహన్‌రెడ్డికి ఓటమిని దేవుడు ముందే రాసి పెట్టాడన్నారు. రాయలసీమ యువత కోసం పరిశ్రమల స్థాపన జరిగిందా, రైతుల కోసం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందా అన్నారు. మూడు రాజధానుల్లో రాయలసీమకు న్యాయం న్యాయరాజధాని అన్నావు అది ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం జాబ్‌క్యాలెండర్, డీఎస్సీ ఏవీ అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఒకటి గుర్తుపెట్టుకోవాలని, రాయలసీమలో పరిశ్రమలు, సెంట్రల్ యూనివర్సిటీలు, తాగు, సాగునీటి ప్రాజెక్టులు తదితరాలు చంద్రబాబు హయాంలోనే సాధ్యమైందన్నారు. ఇప్పటికైనా నమ్మకద్రోహి జగన్‌కు రాయలసీమ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఢిల్లీకి బీజేపీ పురం నాయకులు

హిందూపురం, ఫిబ్రవరి 18 : దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ సమావేశాలకు హిందూపురం నుంచి ఆ పార్టీ నాయకులు తరలి వెళ్లారు. పార్టీ పురం పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి, తిరుపతిజిల్లా ఇన్‌చార్జ్ పీడీ పార్థసారథి, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రమణ మూర్తితో పాటు మరికొంతమంది హిందూపురం నియోజకవర్గం నుంచి వెళ్లారు. వారు శని, ఆదివారాల్లో జరిగిన జాతీయ సమావేశాల్లో పాల్గొననున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యనేతలతో కలిసినట్లు తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన హ్యాండ్‌బాల్ జిల్లా జట్లు

హిందూపురం, ఫిబ్రవరి 18 : రాష్ట్రస్థాయిలో వచ్చేనెల జరిగే హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లను ఆదివారం ఎంపిక చేశారు. హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఇండియా అనుబంధ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ సంఘం ఆధ్వర్యంలో జరిగే 9వ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి జట్లను ఎంపిక చేశారు. జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొనే జట్ల సభ్యులు జ్యోతిక, లలిత, నిఖిత, దివ్య, నాగహర్షిత, జాహ్నవి, వర్షిత , రేణుకారెడ్డి, హేమలత, సాయికీర్తి, నిఖిత, చెర్రి, జాస్మిన్, చందన, ప్రశాంత లక్ష్మి, సుచితరెడ్డి, వెన్నెల, లిఖితను ఎంపిక చేశారు. అదేవిధంగా పురుషుల్లో సందీప్‌కుమార్, జీవన్‌రెడ్డి, ఈశ్వర్, అమాన్, జశ్వంత్, వంశీ, యశ్వంత్, నరేష్‌కుమార్, భరత్, సాయినాథ్, మనోజ్, శివరాజ్, సందీప్‌కుమార్‌ను ఎంపిక చేశారు. వచ్చేనెల 23, 24 తేదీల్లో నంద్యాల్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు, హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బలరాంరెడ్డి, ముస్తాఫ కమల్‌పాశ, వివేకానంద, సందీప్, వేదవతి, యాసీన్‌మాలిక్, అర్షియాబాను తదితరులు పాల్గొన్నారు.